క్లుప్తంగా

బాల్య వివాహాలు నేరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పద్మావతి

డోన్ రూరల్ : మండల పరిధిలోని నక్కలవాగుపల్లి గ్రామంలో శనివారం బాల్య వివాహాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల మూలంగా జరిగే నష్టాలను ఆమె ప్రజలకు వివరించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, మాతాశిశు మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు. బాల్య విహాలు చట్టరీత్యా నేరమని, ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వెంకరెడ్డి, నాగార్జున, ఏఎన్ఎంలు ఇందిరా, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న నాగసిద్దార్థరెడ్డి

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ ఫంక్షన్ హెడ్ నాగసిద్దార్థరెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం జయరామిరెడ్డి, ఉపాధ్యాయులు, అల్ట్రాటెక్ ప్రతినిధులు మదన్‌మోహన్, సూరపునాయుడు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత



మొక్కలు నాటుతున్న ప్రియాంక

బనగానపల్లె రూరల్ : మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా స్వీకరించాలని బనగానపల్లె కేడీసీసీ బ్యాంకు మేనేజర్ ప్రియాంక సూచించారు. శనివారం పట్టణంలోని భానుముక్కల సహకార సంఘం కార్యాలయం ఆవరణలో అంతర్జాతీయ సహకర దినోత్సవం, మన్‌కీ బాత్ సందర్భంగా సొసైటీ సీఈఓ మునాఫ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ మొక్కలు పెంచడం వలన పర్యావరణం రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ శతృఘ్నుడు ఏఈఓజీఎండీ షామీర్ తదిరులు పాల్గొన్నారు.

ఆదర్శ జీవనం గడపాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న షేక్ యాకూబ్ జామై హఫీజ్‌హుల్లాహ్

బేతంచెర్ల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజ సేవాలో పాల్గొంటూ ఆదర్శజీవనం గడపాలని కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లాకు చెందిన ఆధ్యాత్మిక గురువు షేక్ యాకూబ్ జామై హఫీజ్‌హుల్లాహ్, కర్నూలు జిల్లా గవర్నమెంట్ ఖాజీ ముత్తహర్ జామైహఫీజ్ హుల్లాహ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని షాదీఖానాలో మస్జీద్ ఏ తౌహీద్ ఆహ్లె హదీస్ బేతంచెర్ల ఆధ్వర్యంలో ధార్మిక సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఖుర్‌ను అనుసరించి సరైన మార్గంలో నడవాలని ముస్లిం సోదరులకు సూచించారు. అట్టడుగు వారికి తోడ్పాటు అందిస్తే భగవంతుని అనుగ్రహం పొందుతారన్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



ప్రిన్సిపాల్‌కు గ్రీన్ ఆడిట్ సర్టిఫికెట్ అందజేస్తున్న శివశంకర్‌రెడ్డి

కోవెలకుంట్ల: పర్యావరణ పరిరక్షించి వాతావరణ కాలుష్యాన్ని అరికట్టాలని జిల్లా అటవీశాఖ అధికారి శివశంకర్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడవులు అంతరించిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని బాధ్యతగా సంరక్షించాలన్నారు. జీవ వైవిధ్యం, మొక్కల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్‌కు గ్రీన్ ఆడిట్ సర్టిఫికెట్ ప్రధానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, లక్ష్మిదేవి, అన్నపూర్ణ, కృష్ణదాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

మినుము సాగుకే మొగ్గు !

- గతేడాది కలిసొచ్చిన వైనం
- ఈ ఏడాదీ అనుకూలంగామారిన వర్షాలు
- 4,240 ఎకరాల్లో సాగు లక్ష్యం

కోవెలకుంట్ల: మినుము సాగు ఆశలు రేకెత్తిస్తోంది. గతేడాది మినుము సాగు రైతులకు అన్ని విధాలా కలిసి రావడంతో ఈసారి రెట్టింపు ఉత్సాహంతో ఆసక్తి కనబరుస్తున్నారు. స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఈ ఏడాది 4,240 ఎకరాల్లో మినుము సాగు సాధారణ విస్తీర్ణం. జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగా ముందే విస్తారంగా వర్షాలు కురియడంతో రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. ఆయా మండలాల పరిధిలో ఇప్పటి వరకు 1,980 ఎకరాల్లో మినుము సాగైనట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు విత్తనం వేసేందుకు అదును కాగా లక్ష్యానికి మించి సాగయ్యే అవకాశం ఉంది.

రూ. 8 వేల మద్దతు ధర

గతేడాది కోవెలకుంట్ల సబ్ డివిజన్ మండలాల పరిధిలో 3,500 ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, నూర్పిడి తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 10వేల వరకు వెచ్చించారు. సకాలంలో వర్షాలు కురిసి వాతావరణం అనుకూలంగా మారడంతో పంట చేతికందింది. ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. మార్కెట్‌లో క్వింటాం రూ. 8 వేల వరకు ధర పలకడంతో పెట్టుబడులు పోనూ రైతులు లాభాలు గడించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు అనుగుణంగా ముందే వర్షాలు పడడంతో రైతులు మినుము సాగుకే మొగ్గు చూపుతున్నారు. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల మండలంలో 270 ఎకరాలు, దొర్నిపాడు -1,850, ఉయ్యాలవాడ - 1022, సంజామల - 490, కొలిమిగుండ్ల - 113, అవుకు మండలంలో 495 ఎకరాల్లో సాగు సాధారణ విస్తీర్ణం. ఆయా మండలాల్లో ఇప్పటి వరకు దాదాపు రెండు వేల ఎకరాల్లో సాగైంది. సాగుకు మరో 25 రోజులు గడువు ఉండడంతో రైతులు విత్తన పనుల్లో బిజీ అయ్యారు.



కోవెలకుంట్ల సమీపంలో సాగైన మినుము పంట

రెండు ఎకరాల్లో మినుము సాగు



నాకున్న నాలుగు ఎకరాలతోపాటు మరో ఎకరం కౌలుకు తీసుకుని ప్రతి ఏటా మినుము, జొన్న, పప్పుశనగ తదితర పంటలు సాగు చేస్తున్నా. ఈ ఏడాది మినుము సాగుకు వాతావరణం అనుకూలంగా ఉందని రెండు ఎకరాల్లో సాగు చేశా. రసాయన ఎరువులు, విత్తనాలు తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 5 వేలు వెచ్చించా. కలిసొస్తుందని నమ్మకం ఉంది.

– వెంకటేశ్వర్లు, రైతు, జోళదరాశి, కోవెలకుంట్ల మండలం

సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాలి



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సబ్సిడీపై మినుము విత్తనాలు పంపిణీ చేయాలి. మార్కెట్‌లో విత్తన ధర అధికంగా ఉండటంతో భారంగా ఉంది. 50 శాతం సబ్సిడీతో రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు సరఫరా చేయాలి. గతేడాది మినుము సాగు రైతులకు అన్ని విధాలా కలిసి వచ్చింది. ఈ ఏడాది మంచి దిగుబడులు వస్తాయని భావిస్తున్నాం.

– గోవిందరెడ్డి, రైతు, గుంజలపాడు, కోవెలకుంట్ల మండలం

అంటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణకుమార్

కోవెలకుంట్ల: జంతువుల ద్వారా సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్, పశువైద్యాధికారి కృష్ణకుమార్ సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుక్కలు రేబిస్ వ్యాధి బారిన పడకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని సూచించారు. పెంపుడు జంతువుల నుంచి రక్షణ పొందేందుకు వ్యక్తిగత శుభ్రత, నిర్వహణ నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, నరేంద్రనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, లక్ష్మిదేవి, అన్నపూర్ణ, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

- సీఐ ప్రవీణ్‌కుమార్

డోన్ టౌన్ : విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలని, ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. పాతపేట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి అధ్యక్షతన శనివారం విద్యార్థులకు 'క్రమ శిక్షణ, లక్ష్య సాధన' అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుకు సీఐ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థి దశ ప్రతిఒక్కరి జీవితంలో మధురమైనదని, ఈ వయస్సులో దురలవాట్లకు లోను కాకుండా క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తే లక్ష్యాలను చేరుకుంటారన్నారు. ప్రతివిషయంలోనూ క్రమశిక్షణ అనేది ఉండాలని, వాహనాలు నడిపేప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే రూ.25వేల జరిమానా ఉంటుందని, ఇలాంటి విషయాలపై కనీసం కుటుంబ సభ్యులను చైతన్న పరచాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని, అమ్మాయిల విషయంలోనూ జాగ్రత్తగా మెలగాలని హెచ్చరించారు. అదేవిధంగా సమయాన్ని వృథా చేసే సెల్ ఫోన్‌ను అవసరం మేరకే వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకటరమణ, లక్ష్మయ్య, రవిశేఖర్, బాబు, వెంకటలక్ష్మీ, మధుసూధనరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, భారతి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

జగ్జీవన్‌రామ్ అడుగు జాడల్లో నడవాలి

డోన్ టౌన్ : స్వాతంత్ర్య సమరయోధుడు, ఉప ప్రధాని దివంగత జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో యువత నడవాలని సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ పిలుపునిచ్చారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురష్కరించుకొని పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశా ల్లో శనివారం ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా స్థానిక ఎమ్మార్పీస్ కార్యాలయంలో నాయకులు బాబు జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు శ్రీను, రాముడు, పుల్లన్న, రామచంద్రుడు, వెంకటేష్, గణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్ల పట్టణంలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని శనివారం కుల సంఘాల నాయకులు నిర్వహించారు. పట్టణంలోని డోన్ క్రాస్ రోడ్డులోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి మాల మహానాడు సంఘం నాయకులు మేకల నాగరాజు, రూబెన్, ఎమ్మార్పీయస్ రాష్ట్ర కార్యదర్శి తాలుక రాజయ్య, జిల్లా అధ్యక్షులు రామసుబ్బయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

- వార్డెన్‌లా వ్యవహరిస్తున్నారా?
- ఈ నీటిని మీ పిల్లలకు తాపగలరా?
- విద్యార్థినులకు జ్వరం వచ్చినా పట్టించుకోరా... ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులు ?
- ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్, ఎంపీడీఓ

ఇంత నిర్లక్ష్యమా?

ప్యాపిలి: మండల కేంద్రం ప్యాపిలిలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ సాయి మనోహర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డెన్ వెంకటేశ్వరమ్మ హాస్టల్‌లో లేకపోవడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల సమాచారం మేరకు వచ్చిన వార్డెన్ తీరుపై తహసీల్దార్, ఎంపీడీఓ అసహనం వ్యక్తం చేశారు. ఆర్ఓ ప్లాంట్ నిరుపయోగంగా మారడంతో పంచాయతీ నీటినే విద్యార్థినులు తాగుతున్నట్లు తెలుసుకున్న ఎంపీడీఓ ఏమి చేస్తున్నారని వార్డెన్ ప్రశ్నించారు. తాగునీటి ట్యాంకు మూత తెరచి చూడగా జెర్రి, పురుగులు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు వార్డెన్‌లా వ్యవహరిస్తున్నారా... ఈ నీటిని మీ పిల్లలకు తాపగలరా అని ప్రశ్నించారు. నలుగురు విద్యార్థినులు జ్వరంతో బాధపడుతున్న తీరును చూసి చలించిపోయారు. ఆ చిన్నారులకు మధ్యాహ్నం భోజనం కూడా ఏర్పాటు చేయలేదని తెలుసుకున్న ఆయన తక్షణమే సిద్ధం చేయాలని ఆదేశించారు. మీ పిల్లలకు జ్వరం వస్తే ఇలానే చేస్తారా... ఎందుకు ఇంత నిర్లక్ష్యం అని వార్డెన్‌ను ఎంపీడీఓ నిలదీశారు. 70 మంది విద్యార్థినులకు ప్రతి రోజు నాలుగు పాలపాకెట్‌లు మాత్రమే వాడుతున్నారని తెలిసిందని, ఎలా చేస్తున్నారో మాకు మాత్రం అర్థం కావడం లేదని ఎంపీడీఓ ప్రశ్నించారు. చిన్నారులపై చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. వసతి గృహంలోకి అకతాయిలు సైతం చొరబడుతున్నారనే విషయం తెలిసిందని, ఎవరి తప్పిదం వలన.. మీ పర్యవేక్షణ సక్రమంగా ఉంటే ఎందుకిలా జరుగుతుందని ప్రశ్నించారు. చిన్నారులకు ఏదైనా జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందని వార్డెన్ హెచ్చరించిన ఎంపీడీఓ వెంటనే ఫిల్టర్ వాటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తనిఖీలో వెలుగులోకి వచ్చిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తహసీల్దార్, ఎంపీడీఓ తెలిపారు.



వార్డెన్ వెంకటేశ్వరమ్మ హెచ్చరిస్తున్న ఎంపీడీఓ సాయి మనోహర్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : మండలంలోని చిన్నమల్కాపురం సబ్ స్టేషన్‌లోని ఇండస్ట్రీయల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కరెంటు ఉండదని, ఫ్యాక్టరీ యాజమాన్యాలు సహకరించాలని కోరారు. కమలాపురం ఫీడర్ కింద వ్యవసాయానికి సంబంధించి త్రీఫేస్ కరెంటు తెల్లవారు జామున 3 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని వివరించారు.

వేలంపాటలో రూ.4.36లక్షలు ఆదాయం

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో దుకాణాల నిర్వహణకు సంబంధించి శనివారం అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, పర్యవేక్షణాధికారి హరిచంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ వేలంపాటలు గందరగోళం మధ్య సాగింది. టెంకాయల అంగడి నిర్వహణ, క్యాంటిన్, కూల్‌డ్రింక్స్ దుకాణంతోపాటు అమ్మవారి శేషవస్త్రములు(చీరెలు) పోగుకు బహిరంగవేలాలు నిర్వహించాల్సి ఉంది. అయితే గతేడాది టెంకాయల అంగడి, కూల్‌డ్రింక్స్, క్యాంటిన్ దక్కించుకున్న వ్యక్తులు కోర్టుకు వెళ్లడంతో వారికే మరో రెండు నెలలపాటు నిర్వహించుకునేలా కోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ తెలిపారు. దీంతో కేవలం అమ్మవారి శేష వస్త్రాలు పోగుకు సంబంధించి మాత్రమే బహిరంగవేలంపాట నిర్వహించారు. వేలంపాటలో మొత్తం 8 మంది పాటదారులు పాల్గొనగా అల్లె లక్ష్మీకాంత్ రెడ్డి 50.50లక్షలు అత్యధికం వేయడంతో దక్కించుకున్నారు. గతేడాదికంటే రూ.4.36లక్షలు అదనంగా ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు.

అధికారులతో పాటదారుల వాగ్వాదం

అమ్మవారి శేషవస్త్రాలు(చీరెలు) పోగు వేలంపాట సందర్భంగా అధికారులతో పాటదారులు వాగ్వాదానికి దిగారు. సీల్డ్ టెండర్ బాక్స్ ఓపెన్ చేశాకే బహిరంగ వేలం నిర్వహించాలని పట్టుబట్టారు. అయితే నిబంధనల మేరకు బహిరంగవేలం పూర్తయ్యాకే టెండర్ బాక్స్ ఓపెన్ చేయాల్సి ఉంటుందని ఆలయ అధికారులు ఎంత చెప్పినా పాటదారులు వినలేదు. దీంతో గందరగోళం నెలకొంది. చివరకు తప్పని పరిస్థితుల్లో అధికారులు సీల్డ్ బాక్స్‌ను తెరిచి అప్లికేషన్స్‌ను మాత్రం చూయించారు. ఈ విషయంపై ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డిని వివరణ కోరగా సాధారణంగా బహిరంగవేలం పూర్తయ్యాకే సీల్డ్‌బాక్స్ ఓపెన్ చేసి, అందులోని కొటేషన్స్ పరిశీలించాల్సి ఉందన్నారు. అయితే డిపాజిట్ చెల్లించిన పాటదారులు విన్నపం మేరకు సీల్డ్ బాక్స్ ఓపెన్ చేశామే తప్పా కొటేషన్ ఫారమ్స్‌ను కాదన్నారు.



బహిరంగవేలం నిర్వహిస్తున్న అధికారులు

పెంపుడు కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు

బనగానపల్లె రూరల్ : కుక్కల పెంపకందారులు తప్పనిసరిగా యాంటీరేబిస్ టీకాలను వేయించుకోవాలని బనగానపల్లె పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మారుతిసకారామ్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ పశువైద్యశాలలో జూనోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు ఉచితంగా యాంటి రేబిస్ టీకాలను వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల ద్వారా రేబిస్, అంత్రాక్స్,బ్రూసెల్లోసిస్ లాంటి ప్రాణాంతక వ్యాధులు మనుషులకు సోకే అవకాశం ఉందన్నారు. కుక్కల పెంపకందారులు తప్పనిసరిగా యాంటిరేబిస్ టీకాలను వేపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు ఖురేషి, ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పెంపుడు కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారులు కృష్ణ కుమార్, విజయలక్ష్మి సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురష్కరించుకుని శనివారం కోవెలకుంట్ల పశువైద్యశాలతోపాటు బిజనవేముల, కలుగొట్ల పశువైద్య కేంద్రాల పరిధిలో 41 కుక్కలకు టీకాలు వేశారు. వారు మాట్లాడుతూ జూనోసిస్ వ్యాధులు పెంపుడు జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పశువైద్య సిబ్బంది శ్రీకాంత్, శివబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురష్కరించుకొని శనివారం స్థానిక పశువైద్యశాలలో వైద్యాధికారిణి పద్మావతి పెంపుడు కుక్కలు,ఇతర జంతువులకు రేబిస్ వాక్సిన్ వేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 22 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్లు ఆమె తెలిపారు.

అవుకు: జూనోసిస్ డే సందర్భంగా అవుకు, గుండ్లశింగవరం పశువైద్యశాలల్లో డాక్టర్ భారతీ దేవి, డాక్టర్ ఐశ్వర్య పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేశారు. కుక్కలను పెంచుకునే యజమానులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు వివరించారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ రాజేష్, సిబ్బంది రవి, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

సంజామల: సంజామల, కొలిమిగుండ్ల మండలాలో శనివారం విజయవంతంగా రేబిస్ టీకాల స్పెషల్ డ్రైవ్ పూర్తి చేశామని పశుసంవర్ధక శాఖ ప్రత్యేక అధికారి ఏడీ డాక్టర్ మోహన్ రావు అన్నారు. సంజామల మండలంలో 25, కొలిమిగుండ్ల మండలంలో 15 పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు యజమానులు వేయించారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివానంద రెడ్డి, పశువైద్య సిబ్బంది మహబూబ్ బేగ్, ప్రభాకర్, షరీఫ్,అనిత తదితరులు పాల్గొన్నారు.



కుక్కలకు యాంటిరేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ మారుతిసకారామ్



రేబిస్ వ్యాధి నిరోధక టీకా వేస్తున్న పశువైద్యాధికారి కృష్ణకుమార్



పెంపుడు కుక్క యజమానితో మాట్లాడుతున్న ఏడీ డాక్టర్ మెహన్ రావు

ఉచితంగా యాంటీ రేబీస్ ఇంజక్షన్లు

డోన్ : జంతు ప్రేమికులకు జూనోటిక్ లాంటి ప్రాణాంతక వ్యాధులు సోకకుండా వాటి యజమానులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ నాగరాజు అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురష్కరించుకుని శనివారం స్థానిక పశువైద్యశాలలో కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులతో పాటు పశు పక్షాదుల పెంపకం దారులు వాటి ద్వార ఏలాంటి వ్యాధులు సంక్రమించకుండా ముందస్తు టీకాలు వేయించాలని సూచించారు. 122 కుక్కలకు యాంటీ రబీస్ ఇంజక్షన్లను వేసినట్లు డాక్టర్ నాగరాజు తెలిపారు.



కుక్కలకు యాంటీ రేబిస్ ఇంజక్షన్ వేస్తున్న పశువైద్యులు

బేతంచెర్ల: స్థానిక పశువైద్యశాల్లో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా 150 పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలను ఉచితంగా వేశారు. ఈసందర్భంగా వెటర్నరీ వైద్యులు అజయ్, రంగస్వామి మాట్లాడుతూ పశువుల నుంచి, మనుషులకు, మనుషుల నుంచి పశువులకు వ్యాప్తి చెందే రోగాలను జూనోటిక్ వ్యాధులుగా వ్యవహరిస్తారు. ప్రత్యేకించి కక్కల పెంపకందారులు అప్రమత్తంగాఉండాలని సూచించారు.

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

అవుకు: మండల పరిధిలోని వేములపాడు గ్రామానికి చెందిన నర్సపల్లె సంటెన్న (39) కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు శనివారం తెలిపారు. కడుపు నొప్పి తీవ్రం కావడంతో భరించలేక శుక్రవారం క్రిమి సంహారక పొడిని నీటిలో కలుపుకొని తాగాడన్నారు. మృతుని భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు.

పొలాల రహదారి మట్టిని తరలించొద్దు

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామ సమీపాన జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అయితే రహదారి నిర్మాణ పనులకు గ్రామానికి చెందిన రైతుల పొలాల రహదారి మట్టిని తరలిస్తుండడంతో గ్రామస్తులు శేఖర్, మోహన్, స్వాములు, జగదీశ్వర్ రెడ్డి శనివారం అడ్డుకున్నారు. పొలాల రహదారి దెబ్బతినకుండా జాతీయ రహదారికి మట్టిని తరలిస్తే తమకు అభ్యంతరం లేదని గ్రామస్తులు తెలిపారు.